ఆదిభట్లలో హైడ్రా అధికారులు

ఆదిభట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపల్ పరిధిలోని కొంగరకలాన్‌లో హైడ్రా అధికారులు శనివారం పర్యటించారు. మున్సిపల్ పరిధిలోని శ్లోక కన్వెన్షన్ హాల్ నిర్వాహకులు మున్సిపల్‌కు గిఫ్ట్ డీడీ చేసిన రోడ్డును, సర్వేనంబర్ 40, 60లో ఉన్న నక్షా రోడ్డును ఐరా వెంచర్ వాళ్లు ఆక్రమించారని కొంగరకలాన్ ప్రజలు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చామని సీఐ తిరుమలేశ్ తెలిపారు. ఐరా వెంచర్, శ్లోక కన్వెన్షన్ హాల్ నిర్వాహకులకు సంబంధించిన డాక్యుమెంట్స్‌ను హైదరాబాద్ కార్యాలయాన్ని తీసుకురావాలని సూచించామన్నారు. నిబంధనల మేరకు డాక్యుమెంట్స్ లేకుంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు.



దరఖాస్తుల ఆహ్వానం

రంగారెడ్డిఅర్బన్/యాచారం. సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : మైనార్టీలు, క్రిస్టియన్, సిక్కు, బౌద్ధ, జైన్, పార్శీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన పథకం కింద ఆర్థిక సాయం పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి కె.నవీన్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 21 ఏళ్ల నుంచి 55 సంవత్సరాల వయసు గలవారు అర్హులని చెప్పారు. గ్రామీణ ప్రాంత మహిళలకు ఏడాదికి రూ. లక్షా50వేలు, పట్టణప్రాంతాల వారికి ఏడాదికి రూ. రెండు లక్షల ఆదాయం ఉండాలన్నారు. గ్రామీణప్రాంతాల వారు ఎంపీడీవో కార్యాలయంలో, పట్టణ ప్రాంతాల వారు మున్సిపల్ కార్యాలయాలలో దరఖాస్తులనందించాలన్నారు.



నిషేధిత జాబితాలోని భూములను రైతులకు అప్పగించాలి

- ఆన్‌లైన్‌లో టీజీఐఐసీకి బదులు రైతుల పేర్లను నమోదు చేయాలి
- ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ ప్రతినిధులు
- డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ హామీ


ఫార్మాసిటీ బాధిత రైతు ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

యాచారం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడిపల్లి. నానక్‌నగర్, గున్‌గల్ మోడల్ పాఠశాల, యాచారం, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల రైతులకు చెందిన 2500 ఎకరాల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని, ఆన్‌లైన్‌లో వారి పేర్లను నమోదు చేసేదాక తమ ఆందోళన కొనసాగిస్తామని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ ప్రతినిధులు కవుల సరస్వతి, బి.రాజశేఖర్ రెడ్డి, యుగంధర్‌రెడ్డి తదితరులు కలెక్టర్ సి.నారాయణరెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్‌డీవో అనంతరెడ్డిలకు తేల్చి చెప్పారు. శనివారం ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ ప్రతినిధులు కలెక్టర్ చాంబర్‌లో సమావేశమయ్యారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను రైతుల పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు వారికి వర్తించేలా చొరవ తీసుకోవాలని కోరారు. అధికారంలో వస్తే రైతుల భూములను కాపాడుతామని ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్కలు ఇచ్చిన మాటను నిలుపుకోవాలని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కాగా, పది రోజుల్లో మీ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకుంటామని కలెక్టర్ ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ ప్రతినిధులకు వివరించారు.



పూల సింగిడికి వేళాయె

నేడు ఎంగిలిపూల బతుకమ్మ

- రంగురంగుల పూలతో సిద్ధమైన ఆడపడుచులు
- తొమ్మిది రోజుల పాటు సాగనున్న వేడుక



ఒక్కో రోజు ఒక్కో రూపం

- తొలి రోజు ఎంగిలిపూలు
- రెండో రోజు అటుకుల
- మూడో రోజు ముద్దపప్పు
- నాలుగో రోజు నానే బియ్యం
- ఐదో రోజు అట్ల
- ఆరో రోజు అలిగిన
- ఏడో రోజు వేపకాయల
- ఎనిమిదో రోజు వెన్నముద్దల
- తొమ్మిదో రోజు సద్దులు




ఆమనగల్లులోని ఓ పాఠశాలలో బతుకమ్మ వేడుకలు


ఆదిభట్లలో..

పూల సింగిడికి వేళైంది. నేటి నుంచి ప్రారంభం కానున్న బతుకమ్మ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పూల పండగతో తెలుగు లోగిళ్లు కళకళలాడనున్నాయి. బతుకమ్మను అందంగా తీర్చిదిద్దేందుకు ఆడపడుచులు ఇప్పటికే రంగురంగుల పూలను సమకూర్చుకున్నారు. తొమ్మిది రోజులు సాగనున్న ఈ పూల జాతర ఎంగిలిపూలతో ప్రారంభమై చివరి రోజు సద్దుల బతుకమ్మతో ముగియనుంది. ఇది ప్రకృతిని ఆరాధించే పెద్ద పండుగ. పూలు బాగా వికసించే కాలంలో, జలవనరులు సమృద్ధిగా పొంగి పొర్లే సమయంలో ఈ పండగ జరుపుకోవడం ఆనవాయితి. నేడు (ఆదివారం, అమావాస్య) ఎంగిలిపూల బతుకమ్మను ఘనంగా జరుపుకునేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఊరూవాడా సిద్ధమైంది.

-వికారాబాద్, సెప్టెంబరు 20, (ఆంధ్రజ్యోతి,ప్రతినిధి)



ప్రత్యేకమైన నైవేద్యాలతో

ఈ పూల జాతర జరిగే తొమ్మిది రోజుల్లో ఆడపడుచులు అత్తవారి ఇంటి నుంచి పుట్టింటికి చేరుకుని బతుకమ్మ ఆడటం ఆనవాయితీ. ఐక్యత, సోదరభావం, ప్రేమను కలిపి బతుకమ్మలను ఓ కూడలిలో ఉంచి మానవహారంగా ఏర్పడి పాటలు పాడతారు. తర్వాత దగ్గరలో ఉన్న పుష్కరిణి, చెరువులు, కుంటలు, వాగుల్లో నిమజ్జనం చేస్తారు. తొమ్మిది రోజుల పాటు ప్రతి రోజు ఓ ప్రత్యేకమైన నైవేద్యం సమర్పిస్తారు. మొదటి ఎనిమిది రోజులు ఈ నైవేద్యం తయారీలో యువతీ యువకులు పాల్గొంటారు. చివరి రోజును సద్దుల బతుకమ్మకు మాత్రం నైవేద్యాన్ని మహిళలు మాత్రమే తయారు చేస్తారు.

కడ్తాలలోని ఓ పాఠశాలలో బతుకమ్మ వేడుకలు



సమాజం గర్వించేలా ఎదగాలి

- సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ


లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న సేవా సమితి సభ్యులు

చేవెళ్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) సమాజం గర్వించేలా, దేశానికి విలువైన ఆస్తిగా విద్యార్థులు ఎదగాలని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో మానవతా విలువలపై కళాశాల విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు సమాజంలో ఉన్నత విలువలను పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. దేశం ఏమి ఇచ్చింది అని కాకుండా మనం ఏం చేశామని ఆలోచించాలని సూచించారు. ప్రముఖ సైకాలజిస్టులు గంప నాగేశ్వర్‌రావు, మల్లేష్ మాట్లాడుతూ... విద్యార్థులు ఆలోచించి అడుగు వేయాలన్నారు. జీవితంలో ఒక్క చిన్నతప్పు జరిగినా సరిదిద్దుకోలేని పొరపాటు అవుతుందన్నారు. పాప బీతి, సంఘ నీతి, దైవప్రీతి ఈ మూడు విషయాలపై దృష్టిసారించాలని సూచించారు. నిజమైన హీరోలు సినిమావారు కాదని, దేశభద్రత కోసం పోరాడుతున్న సైనికులు, అహర్నిశలు శ్రమిస్తున్న తల్లిదండ్రులు, విద్యాబుద్ధులు నేర్పించే ఉపాధ్యాయులు అని చెప్పారు. నార్కొటిక్ విభాగం ఎస్పీ కృష్ణమూర్తి, శ్రీ సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర ఆధ్యాత్మిక కోఆర్డినేటర్ రేగళ్ల అనిల్‌కుమార్, విద్యావిభాగం కోఆర్డినేటర్ యాదగిరిరావు, గోపాలచారి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బండారు శైలజాఆగిరెడ్డి ఉన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా

- ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి

ఆదిభట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఓటర్ జాబితాను పకడ్బందీగా తయారు చేస్తామని ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆదిభట్ల మున్సిపల్ పరిధిలోని ప్రమీదా గార్డెన్‌లో స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్)2002 పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2002 ఎస్‌ఐఆర్ జాబితాను పునః పరిశీలించామన్నారు. గతంలో ఉన్న పోలింగ్ కేంద్రాల పరిధి, ప్రస్తుత కేంద్రాల పరిధి పోల్చుతూ ఓటరు జాబితాను పరిశీలించాలని బీఎల్‌వోలకు సూచించారు. ఓటరు లిస్టులను మూడు దశలుగా విభజించి క్షేత్రస్థాయిలో జాబితాను పరిశీలిస్తామన్నారు. 2002 నుంచి 2022 వరకు ఓటర్ జాబితాలో కొత్త పేర్లు, చనిపోయిన ఓటర్ల పేర్లను గుర్తించాలన్నారు. ప్రతీ బూత్ పరిధిలో ఎంట్రీలను క్షేత్రస్థాయిలో ధ్రువీకరణ చేసేలా అధికారులు పరిశీలన చేయాలన్నారు.

డెంగీతో చిన్నారి మృతి?

కొత్తూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శేరిగూడ బద్రాయపల్లి గ్రామానికి చెందిన వాసు ప్రియ(8) అనే చిన్నారి డెంగీ వ్యాధితో మృతి చెందిందని తెలుస్తుంది. కుటుంబసభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం... గత వారం రోజులుగా వాసు ప్రియ జలుబు, జ్వరంతో బాధపడుతుంది. కుటుంబసభ్యులు గ్రామంలోని ఆర్‌ఎంపీల వద్ద చిన్నారికి వైద్యం చేయించారు. శుక్రవారం రాత్రి చిన్నారి వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించిన అనంతరం మృతి చెందింది. విషయం తెలుసుకున్న కొత్తూర్ పీహెచ్‌సీ డాక్టర్ దీప్తి తన సిబ్బందితో కలిసి చిన్నారి ఇంటికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ దీప్తి మాట్లాడుతూ చిన్నారికి కుటుంబసభ్యులు ఆర్‌ఎంపీల వద్ద వైద్యం చేయించారని తెలిపారు. చిన్నారికి సంబంధించి ఎలాంటి వైద్య రిపోర్టులు లేవన్నారు. దాంతో డెంగీపై నిర్ధారణకు రాలేకపోతున్నామన్నారు. గ్రామంలో ఒకరికి ఇటీవల డెంగీ వ్యాధి వచ్చిందని, ఆస్పత్రిలో వైద్యం చేయించుకుని క్షేమంగా ఇంటికి తిరిగి వచ్చారన్నారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు డాక్టర్ దీప్తి పేర్కొన్నారు.

ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి

- శంషాబాద్ డీసీపీ రాజేశ్


సిబ్బందితో శంషాబాద్ డీసీపీ రాజేశ్

కడ్తాల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పోలీసుస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని శంషాబాద్ డీసీపీ రాజేశ్ సూచించారు. బాధితుల ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలన్నారు. కడ్తాల పోలీసు స్టేషన్‌ను శనివారం అడిషనల్ డీసీపీ పూర్ణచందర్, షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణలతో కలిసి డీసీపీ సందర్శించారు. రికార్డులను, పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాల గురించి సీఐ గంగాధర్, ఎస్‌ఐలు వరప్రసాద్, చంద్రశేఖర్‌లను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కేసుల నమోదు, దర్యాప్తు ప్రక్రియలో పారదర్శకగా వ్యవహరించాలన్నారు. విధి నిర్వహణలో పోలీసులు అలసత్వం చూపొద్దన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. దసరా పండుగ నేపథ్యంలో జాతీయ రహదారిపై వాహనాల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉందని, తగిన కంట్రోలింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని గ్రామాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని తెలిపారు.

శక్రుకు జాతీయస్థాయి అవార్డు

- పట్టుపురుగుల పెంపకంలో ఉత్తమ రైతుగా ఎంపిక


కేంద్రమంత్రి గిరిరాజ్‌సింగ్ నుంచి అవార్డు అందుకుంటున్న శక్రు నాయక్

తలకొండపల్లి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మల్బరీ సాగు, పట్టు పురుగుల పెంపకంలో తలకొండపల్లి మండలం కోరింతకుంట తండాకు చెందిన మూడావత్ శక్రు నాయక్‌కు జాతీయ స్థాయి అవార్డు లభించింది. జాతీయ పట్టు పరిశ్రమ శాఖ 76వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఉత్తమ రైతులను ఎంపిక చేసి అవార్డులు ప్రదానం చేశారు. తెలంగాణ నుంచి శక్రునాయక్ ఈ అవార్డుకు ఎంపికయ్యారు. శనివారం బెంగుళూర్ జీకేవీకే యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర జౌళి శాఖమంత్రి గిరిరాజ్ సింగ్ నుంచి శక్రునాయక్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శక్రు నాయక్‌ను గిరిజన నేతలు డాక్టర్ బాణావత్ హేమ్‌లాల్, ప్రేమ్‌లాల్ నాయక్ తదితరులు అభినందించారు.

ఎల్‌కేజీ విద్యార్థిని చితకబాదిన టీచర్?

- వీపుపై గాయాలు
- అడిగేందుకు వెళ్లిన తండ్రిపై ప్రిన్సిపాల్ కించపరిచే వ్యాఖ్యలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నాయీబ్రాహ్మణులు
- జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో ఘటన

వివరాలు 7లో..



వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట


కోదండరెడ్డిని కలిసిన సొసైటీ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి తదితరులు

కందుకూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిందని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్.వెంకట్‌రాంరెడ్డి శనివారం పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డిలు హైదరాబాద్‌లో కోదండరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇచ్చిన హామీలన్నీ దశలవారీగా అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషిచేస్తున్నారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలకులు ప్రజావ్యతిరేక విధానాలు అవలంభించారని, వాటిని ప్రజలకు వివరిస్తూనే, అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో సొసైటీ పాలకవర్గాల కాలపరిమితి ముగిసినందున ప్రభుత్వం జీవో తెచ్చి కొత్త చైర్‌పర్సన్లకు బాధ్యతలు అప్పగించడం సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మహేశ్‌గౌడ్, మహేశ్వరం ఏఎంసీ డైరక్టర్లు కె.విష్ణువర్ధన్‌రెడ్డి, కె.ప్రశాంత్‌కుమార్, మాజీ సర్పంచ్ ఇ.రాంచంద్రారెడ్డి, నాయకులు అమరేందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, డి.రామము పాల్గొన్నారు.

ఏడుగురు జీపీవోల కేటాయింపు

తాండూరు రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలానికి ప్రభుత్వం జీపీవోలను కేటాయించిందని తహసీల్దార్ శనివారం తెలిపారు. 22 క్లస్టర్లకు ఏడుగురు విధుల్లో చేరినట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో వ్యర్థ తేజస్‌నాయక్, రాంచంద్రయ్య, కిష్టప్ప, నర్మద, నీరటి వెంకటయ్య, చిన్న నర్సింహులులను మండలానికి కేటాయించారని జరిగిందని తెలిపారు. కాగా మరో 15మంది మండలానికి రావాల్సి ఉందని చెప్పారు.

పెన్షన్‌దారులకు న్యాయం చేయాలి


నాగారం మహాధర్నాలో మాట్లాడుతున్న రావుగళ్ల బాబు

మహేశ్వరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులు, ఒంటరి మహిళలకు పెన్షన్‌మొత్తాన్ని పెంచే వరకు, కొత్త వారికి మంజూరు చేసే వరకు పోరాడుదామని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డిజిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబు అన్నారు. శనివారం నాగారం పంచాయతీ ఆఫీసు వద్ద పెన్షన్‌దారులతో కలిసి మహాధర్నా నిర్వహించారు. వికలాంగులకు 6వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు 4వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏపీలో సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం 6వేల పెన్షన్ ఇస్తున్నారని తెలిపారు. తెలంగాణలోనూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ పెంచి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బక్కని రవి, ఎర్ర గణేశ్, కృష్ణ శ్రీకాంత్, రాములు, శంకరయ్య, నర్సింహ, కమలమ్మ, సుమతి, సరోజ, సభద్ర పాల్గొన్నారు.

సొసైటీ గోదాం.. మిల్లర్‌కు కేటాయింపు!


పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్మించిన గోదాం

తాండూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులకు సేవల ందించాల్సిన యాలాల ప్రాథమిక వ్యవసాయ పరపతి కేంద్రం నిర్వాహకులు రైస్ మిల్లర్ సేవలో తరిస్తున్నారు. రైతుల ధాన్యం నిల్వ కోసం రూ.2కోట్లతో దౌలాపూర్ వద్ద నిర్మించిన గోదాంను రైస్ మిల్లర్ ధాన్యం నిల్వ కోసం ఉచితంగా కేటాయించారు. గోదాం కేటాయింపునకు సొసైటీ తీర్మానం కూడా లేదు. ధాన్యం నిల్వ చేసుకుంటున్న మిల్లర్ సొసైటీకి రుసుమేమీ చెల్లించడం లేదు.

















ఎంపీ డీకే అరుణకు వినతిపత్రం అందిస్తున్న ట్రిపుల్ ఆర్ నిర్వాసితులు

ట్రిపుల్ ఆర్ నిర్వాసితులకు అండగా ఉంటా

» మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

కేశంపేట/కొందుర్గు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రీజనల్ రింగ్ రోడ్డు నిర్వాసితులకు అండగా ఉంటానని, రైతులు అధైర్య పడొద్దని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ భరోసా ఇచ్చారు. తొమ్మిదిరేకుల చెందిన నిర్వాసిత రైతులు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఎంపీ క్యాంప్ కార్యాలయానికి వెళ్లి డీకే అరుణను కలిశారు. ట్రిపుల్‌ఆర్‌కు తాము వ్యతిరేకం కాదని, చిన్న, సన్న కారు రైతులకు అన్యాయం జరుగకుండా చూడాలని కోరారు. పాత అలైన్మెంట్ ప్రకారమే ప్రభుత్వ భూముల్లో నుంచి రోడ్డు రోడ్డేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎంపీ బాధితుల పక్షాన పోరాటం చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నరసింహయాదవ్, రైతులు గుత్తి రంగయ్య, భీమయ్య, నరసింహారెడ్డి, వెంకట్రెడ్డి, జంగయ్య, తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, లక్ష్మయ్య, నరేష్, లక్ష్మయ్య పాల్గొన్నారు. ఉమ్మడి కొందుర్గు మండల ఎంపీ డీకే అరుణకు వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి మండలంలో తుమ్మలపల్లి, తూంపల్లి, వనంపల్లి, ఆగిర్యాల, చెరుకుపల్లి, గంగన్నగూడ, తంగళ్లపల్లి గ్రామాల్లో రైతుల భూములు ట్రిపుల్‌ఆర్‌కు సేకరించాలని నిర్ణయించారని వాపోయారు. ట్రిపుల్ ఆర్ అలైన్మెంట్ మార్చించాలని ఎంపీని కోరారు. కార్యక్రమంలో కొందుర్గు మండల బీజేపీ అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, నాయకులు నర్సింహ, శ్రీనివాస్, యుగేందర్, తిరుపతి, మాజీ సర్పంచి బాల్‌రాజ్, బల్వంతరెడ్డి, మల్లారెడ్డి, మహిపాల్‌రెడ్డి, రవికుమార్, బోయ అశోక్ పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పాలన

» కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షలకనుగుణంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నియోజకవర్గంలో శనివారం ఆయన పర్యటించారు. రూ.72లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే మున్సిపాలిటీలు, గ్రామాలు, తండాల్లో ప్రగతి కాంతులు నిండి ప్రజలకు మౌలిక వసతులు చేకూరుతున్నాయన్నారు. సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం అవుతుందన్నారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో 20ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల, 50ఎకరాల్లో స్కిల్ సెంటర్, 5ఎకరాల్లో 220కేవీ సబ్‌స్టేషన్ నిర్మించేందుకు చర్యలు చేపట్టినట్లు కసిరెడ్డి వివరించారు. నాయకులు భట్టు కిషన్‌రెడ్డి, బొజ్జ సాయిరెడ్డి, ఆనంద్‌కుమార్, విజయ్‌కుమార్‌రెడ్డి, సూదిని కొండల్‌రెడ్డి, యాట నర్సింహ, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పర్వతరెడ్డి, కిశోర్‌రెడ్డి, మోతీలాల్ నాయక్ పాల్గొన్నారు.



రతన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచారి

బాలాజీసింగ్‌కు ఆచారి పరామర్శ

ఆమనగల్లు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి):పీసీసీ అధికార ప్రతినిధి, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్ తండ్రి రతన్‌సింగ్ ఠాకూర్ మృతి పట్ల బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి సంతాపం తెలిపారు. కల్వకుర్తిలోని ఆయన నివాసంలో బాలాజీసింగ్‌ను పరామర్శించారు. రతన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయుడిగా రతన్‌సింగ్ సేవలను కొనియాడారు. పరామర్శించిన వారిలో నాయకులు కండె హరిప్రసాద్, గోరటి నర్సింహ, శ్రీకాంత్‌సింగ్, విక్రమ్‌రెడ్డి, ఎర్రవోలు శ్రీను, లక్ష్మణ్, రవిరాథోడ్, దుర్గాప్రసాద్ ఉన్నారు. అలాగే బాలాజీసింగ్‌ను మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ పరామర్శించారు.

రైతులు విత్తనోత్పత్తి చేసుకోవాలి



కోట్‌పల్లి సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతులు తమ పొలాల్లోనే విత్తన ఉత్పత్తి చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త సునీత అన్నారు. శనివారం ఎన్నారం, రాంపూర్ గ్రామాల్లో కంది, వరి పంటలను సందర్శించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏవో కరుణాకర్‌రెడ్డి, ఏఈవో నర్మద, రైతులు ఉన్నారు.



● ఇళ్లకు పోదాం...

స్కూళ్లకు దసరా సెలవులు రావడంతో విద్యార్థులు ఇళ్లబాట పట్టారు. శనివారం చేవెళ్ల మోడల్ స్కూల్ విద్యార్థులు ఊళ్లకు బయల్దేరారు.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి

పొలాలు కోల్పోయే రైతులకు కొంగర కలాన్‌లో భూమివ్వాలి

తలకొండపల్లి, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు అలైన్మెంట్‌ను మార్చి రైతులకు అన్యాయం జరుగకుండా చూడాలని మిషన్ భగీరథ కార్పొరేషన్ మాజీ వైస్‌చైర్మన్, మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ ప్రభుత్వాన్ని కోరారు. మొదట ప్రతిపాదించిన విధంగానే ట్రిపుల్ ఆర్ నిర్మాణం చేపట్టాలన్నారు. ఒక వేళ భూములు తీసుకుంటే నిర్వాసిత రైతులకు మహేశ్వరం, కొంగర కలాన్‌లలో ఉన్న ప్రభుత్వ భూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జంగారెడ్డిపల్లిలో శనివారం వెంకటేశ్ పర్యటించారు. ట్రిపుల్‌ఆర్‌కు సేకరించాలనుకుంటున్న భూములను పరిశీలించి రైతులతో సమావేశమయ్యారు. రైతులు ఆందోళన చెందొద్దని, అలైన్మెంట్ మార్చే వరకు తాము అండగా ఉంటామని మనోధైర్యాన్ని కల్పించారు. రోడ్డుకు భూములు లాక్కోవడం అన్యాయమని, ఒక వేళ తీసుకుంటే మార్కెట్ రేటుకు పదింతల అధిక పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతుల పొట్టకొట్టి ట్రిపుల్‌ఆర్ ఎవరి ప్రయోజనం కోసం వేస్తున్నారని మండిపడ్డారు. రైతులకు అన్యాయం చేస్తే ఎంతటి పోరాటాలకైనా సిద్ధమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గోపాల్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు లలితజ్యోతయ్య, లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.



ట్రిపుల్‌ఆర్ ప్రతిపాదిత భూములను పరిశీలిస్తున్న ఉప్పల వెంకటేశ్

శరన్నవరాత్రులకు ఆలయాల ముస్తాబు

రేపటి నుంచి దసరా ఉత్సవాలు

13 రోజుల పాటు వేడుకలు

భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు

రోజుకొక అవతారంలో దుర్గామాత దర్శనం

దేవీ శరన్నవరాత్రోత్సవాలకు అమ్మవారి ఆలయాలు ముస్తాబుతున్నాయి. జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం, శ్రీ రాజరాజేశ్వరి దేవి సమేత శివభక్త మార్కండేయ స్వామి ఆలయం, కడ్తాల మండలంలోని మైసిగండి మైసమ్మ దేవత, శివరామాలయాలతో పాటు శ్రీఅన్నపూర్ణేశ్వరీ మహాలక్ష్మి జ్ఞాన సరస్వతీదేవి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. నవరాత్రుల వేడుకల నిర్వహణకు భక్తుల సౌకర్యార్థం ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 22 నుంచి 13 రోజుల పాటు శరన్నవరాత్రోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు.

- ఆమనగల్లు/కడ్తాల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి)



శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన మైసిగండి శివ రామాలయం



మైసిగండి వద్ద భారీ ఏర్పాట్లు

ప్రముఖ పుణ్యక్షేత్రం కడ్తాల మండలంలోని మైసిగండి మైసమ్మ, శివరామాలయ దేవాలయాలు, శ్రీఅన్నపూర్ణేశ్వరీ మహాలక్ష్మి జ్ఞానసరస్వతీదేవి ఆలయాలు శరన్నవరాత్రోత్సవాలకు ముస్తాబయ్యాయి. ఇక్కడ ఏటా అశ్వయుజ శుద్ధపాడ్యమి మొదలు శుద్ధ దశమి వరకు దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. ఇక్కడికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల జిల్లాల నుంచి సైతం వేడుకలను తిలకించేందుకు భక్తులు తరలివస్తారు. మైసిగండి శివాలయం వద్ద 11 రోజులు నిర్వహించే ఉత్సవాలకు ఆలయ నిర్వాహకులు, దేవాదాయ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం పందిళ్లు వేసి, తాగునీటి వసతి కల్పిస్తున్నారు. విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరిస్తున్నారు. మండప దర్శనానికి క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. కల్వకుర్తి, ఆమనగల్లు, హైదరాబాద్‌ల నుంచి మైసిగండికి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ ఫౌండర్ ట్రస్టీ సిరోలీపంతూ, ఈవో స్నేహలత కోరారు.

మార్కండేయ ఆలయంలో నిత్య పూజలు



ఆమనగల్లు పట్టణంలోని శ్రీ రాజరాజేశ్వరి దేవి సమేత శివభక్త మార్కండేయ స్వామి ఆలయం దసరా ఉత్సవాలకు ముస్తాబైంది. ఇక్కడ ఏటా దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. ఆలయ కమిటీ, పద్మశాలీ యువజన, మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా రోజుకో అవతారంలో అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించనున్నారు. 11 రోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఎంగిళి బాలకృష్ణ తెలిపారు. ఈ నెల 22 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాల గురించి వివరించారు. 4న దుర్గాదేవి శోభాయాత్ర ఉంటుందని తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం కోరారు.



శ్రీ మార్కండేయ స్వామి ఆలయం

కన్యకా పరమేశ్వరి ఆలయంలో..





దసరాను పురస్కరించుకొని ఏటా ఆమనగల్లులోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. అక్టోబరు 4వ తేదీ వరకు కొనసాగే ఉత్సవాల కోసం ఆలయ నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. 13 రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా నిత్యం యజ్ఞం, హోమం, అభిషేకాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి బికుమాండ్ల నర్సింహ, కోశాధికారి బికుమాండ్ల శ్రీనివాస్ తెలిపారు. నవరాత్రుల్లో మండల ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవీ క్లబ్, వాసవి వనితాక్లబ్, వాసవీ సీనియర్ సిటిజన్ క్లబ్‌లు, ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

న్యాయం పక్షాన నిలవండి

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి):పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా న్యాయం పక్షాన నిలిచి, బాధితులకు భరోసానిస్తూ వృత్తి గౌరవాన్ని పెంచాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆకాంక్షించారు. షాద్‌నగర్ పోక్సో కోర్టు పీపీగా నియమితులైన న్యాయవాది సబియాసుల్తానా, 16వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టుకు అదనపు పీపీగా నియమితులైన చంద్రశేఖర్‌రెడ్డి శనివారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. వారిద్దర్ని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో సన్మానించి అభినందించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బాధితులకు న్యాయం చేకూర్చేలా పని చేయాలని కోరారు. న్యాయం, చట్టాలపై ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలన్నారు.

ప్రజాస్వామ్య విలువలు కాపాడాలి

నందిగామ: ప్రతి ఒక్కరు ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని, తెలివైన నాయకులను ఎన్నుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రంగాపూర్‌లోని హిప్పోక్యాంపస్ పాఠశాలలో నిర్వహించిన నేషనల్ యూత్ పార్లమెంట్ స్కీమ్‌లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. విద్యార్థులు మాక్ పార్లమెంట్ నిర్వహించారు.



పబ్లిక్ ప్రాసిక్యూటర్లను అభినందిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న మెతుకు ఆనంద్

కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ మోసం

» బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్

వికారాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ చెప్పిన యూత్ డిక్లరేషన్ పెద్ద మోసమని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ ఆరోపించారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో యువజన విభాగం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రెండు లక్షల ఉద్యోగాల హామీ ఎక్కడ పోయిందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిర్వహించిన పరీక్షల్లోనూ అవకతవకలతో యువతను మోసం చేశారని మండిపడ్డారు. రాజీవ్ యువ వికాసం పథకం కూడా మోసమేనని, రేవంత్ చెప్పిన కల్లబొల్లి హామీలు అమలు కాని కలలు గానే మిగిలి పోయాయని తెలిపారు. ఇలాంటి మోసపూరిత చర్యలకు యువత మరోసారి మోసపోరని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతారని హితవు పలికారు. కార్యక్రమంలో వికారాబాద్ మండల అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు పడిగళ్ల అశోక్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు గయాజ్, యువజన విభాగం అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, సోషల్ మీడియా అధ్యక్షులు అనిల్, ఎస్సీ విభాగం అధ్యక్షుడు శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ ఎర్రవల్లి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాడైన రోడ్లకు మరమ్మతులు



శామీర్‌పేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తూంకుంటలో ఇటీవలి భారీ వర్షాలకు పాడైన రోడ్ల ను శనివారం తూంకుంట మున్సిపల్, ఆర్ అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టారు. దేవరయంజాల్ వద్ద ఆర్ అండ్‌బీ రోడ్డు కు పడ్డ గండిని పూడ్చివేయించేందుకు మున్సిపల్ కమిషనర్ జ్యోతి, ఆర్‌అండ్‌బీ డీఈఈ శంకర్, ఏఈలు పరిశీలించారు. అలాగే పట్టణంలో పలు చోట్ల పాడైన రోడ్లను మరమ్మతులు చేయించేందుకు నిర్ణయించారు.

ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలి

లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వెంటనే వెంటనే మొదలుపెట్టాలని కమిషనర్ జ్యోతి తెలిపారు. ఆమె ఇందిరమ్మ కమిటీ సభ్యుల, లబ్ధిదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ఇళ్లు మంజూరైన వారికి పట్టాలను ఇస్తామని చెప్పారు. నిర్మాణాల్లో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తేవాలని భరోసా ఇచ్చారు.

మద్యం మత్తులో తల్లిని చంపిన కొడుకు



నర్సమ్మ(ఫైల్)

చేవెళ్ల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కన్న తల్లిని కొడవలితో నరికి చంపిన ఘటన చేవెళ్ల మండలం రేగడిఘనపూర్‌లో శనివారం చేటుచేసుకుంది. మృతురాలి కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రేగడిఘనపూర్‌నకు చెందిన గొంగుపల్లి నర్సమ్మ(70)కు నలుగురు కుమారులు. మూడో కుమారుడు జంగయ్య చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా కొంతకాలం పనిచేసి ఇటీవల మానేశాడు. జులాయిగా తిరుగుతూ తాగుడుకు బానిసయ్యాడు. అతడి భార్య, పిల్లలు కొద్ది చిట్టంపల్లిలోని పుట్టింటికి వెళ్లి పోయారు. జంగయ్య తల్లి నర్సమ్మతో ఉంటున్నాడు. శనివారం మధ్యాహ్నం జంగయ్య మద్యం తాగి ఇంట్లో నిద్రిస్తున్న నర్సమ్మ తలపై కొడవలితో కొట్టగా ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. మృతదేహంపై దుప్పటి కప్పి.. బయట కొచ్చి తన తల్లి పలకడం లేదని చుట్టుపక్కల వారికి చెప్పాడు. నర్సమ్మను కొడవలితో కొట్టగా చనిపోయినట్టు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు చేరుకొని జంగయ్యను అదుపులోకి తీసుకున్నారు. నర్సమ్మ కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎల్‌కేజీ విద్యార్థిని చితకబాదిన టీచర్

- బాలుడి వీపుపై గాయాలు
- ప్రశ్నించిన తండ్రిని కులం పేరుతో దూషించిన ప్రిన్సిపాల్
- చౌదరిగూడలోని 'అభ్యాస్' పాఠశాలలో ఘటన

చౌదరిగూడ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఓ ఎల్‌కేజీ విద్యార్థిని ఉపాధ్యాయుడు చితకబాదాడు. దీంతో వీపుపై గాయాలయ్యాయి. ఇదేమని ప్రశ్నించిన తండ్రిని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కులం పేరుతో దూషించారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో అభ్యాస్ విద్యాపీఠం పాఠశాలలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే... రెండేళ్లుగా కొనసాగుతున్న ఈ పాఠశాలలో ఎల్‌కేజీ విద్యార్థి ఆర్యన్(4)పై గత శుక్రవారం ఓ టీచర్ వీపుపై బలంగా కొట్టడంతో వాతలొచ్చి గాయాలయ్యాయి. గమనించిన బాలుడి తండ్రి లక్ష్మీనారాయణ శనివారం ఉదయం పాఠశాలకు వెళ్లి ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్‌ను ప్రశ్నించారు. 'మీరు గడ్డం చేసేటప్పుడు (లక్ష్మీనారాయణ నాయీ బ్రాహ్మణుడు) గొంతు కాడ తెగదా?' అంటూ ప్రిన్సిపాల్ కులం పేరుతో దూషించాడు. తన కొడుకును కొట్టిన టీచర్‌పై, తనను కులం పేరుతో కించపర్చిన ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని బాలుడి తండ్రి డిమాండ్ చేశారు. తన కుమారుడిని తీవ్రంగా కొట్టిన దాష్టీకాన్ని ప్రశ్నించేందుకు వెళ్తే ప్రిన్సిపాల్ తన కులవృత్తిని కించపరిచేలా మాట్లాడడం ఏమిటని వాపోయాడు. కాగా, 3 నెలల క్రితం ఇదే పాఠశాలలో గాలిగూడకు చెందిన ఓ చిన్నారి చెవికమ్మ పోయి చెవికి గాయమైంది. ఈ విషయమై తల్లిదండ్రులు ప్రిన్సిపాల్‌ను ప్రశ్నిస్తే.. వారిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి భయభ్రాంతులకు గురి చేశారు.



కుమారుడి వీపుపై గాయాలను చూపుతున్న లక్ష్మీనారాయణ



బాలుడు ఆర్యన్ వీపుపై గాయాలు

విద్యార్థుల బతుకమ్మ సంబురాలు



యాచారం : మేడిపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన హెచ్ఎం ఉదయశ్రీ, విద్యార్థినులు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ప్రకృతి పూల పండుగ బతుకమ్మ వేడుకలను జిల్లావ్యాప్తంగా శనివారం పలు పాఠశాలల్లో ఉత్సాహంగా జరుపుకున్నారు. కళాశాలలు, పాఠశాలల్లో సందడి నెలకొంది. విద్యార్థినులు వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి అలంకరించుకొని పాఠశాలకు చేరుకొని ఆడిపాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు బతుకమ్మ పాటలు పాడుతూ వేడుకలు నిర్వహించారు. అనంతరం నిమజ్జనం చేశారు.



షాద్‌నగర్ అర్బన్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో టీచర్లు, విద్యార్థులు



శంకర్‌పల్లి : రేవతి హైస్కూల్‌లో బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయులు, చిన్నారులు

షాబాద్ : నాగర్‌గూడ శ్రీచైతన్య హైస్కూల్లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు





కొందుర్గు : ఆక్స్‌ఫర్డ్ పాఠశాల ఆవరణలో టీచర్లు, విద్యార్థులు

హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం



శంషాబాద్ రూరల్ : కవ్వగూడలో కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తలకొండపల్లి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రకటించిన విధంగా పింఛన్ డబ్బులు పెంచి ఇవ్వాలని కోరుతూ తలకొండపల్లి మండల కేంద్రంలో శనివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి పోతుగంటి శ్రీకాంత్ మాదిగ, వీహెచ్‌పీఎస్ మండలాధ్యక్షుడు పెరుమాండ్ల నారాయణ మాదిగల ఆధ్వర్యంలో ఆసరా, దివ్యాంగుల పింఛన్‌దారులు ర్యాలీ నిర్వహించారు. జీపీ కార్యాలయం వద్దకు చేరుకొని ధర్నా చేపట్టారు. సీఎం రేవంత్ రెడ్డి పింఛన్‌దారులను మోసగించారని ఆరోపించారు. అశ్వయాదయ్య, బాలమణి, రామేశ్వరమ్మ, పార్వతమ్మ, సుగుణమ్మ, లక్ష్మమ్మ, పింఛన్‌దారులు ఉన్నారు.

శంషాబాద్ రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేరవేర్చాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్ చేసింది. మండల పరిధిలోని కవ్వగూడ, జూకల్, పెద్దషాపూర్ గ్రామ పంచాయతీల్లో వికలాంగులకు, వృద్ధులకు, వితంతువులకు పింఛన్లు పెంచి ఇవ్వాలని ఇన్‌చార్జి కొత్తూరు రమేష్ మాదిగ ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగులకు పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చిందని, ఇప్పటివరకు పెంచడం లేదని ఆరోపించారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ప్రతీ గ్రామ పంచాయతీలో వినతిపత్రాలు అందజేస్తామని, పింఛన్లు పెంచే వరకు మా ఉద్యమం కొనసాగుతోందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పట్టణాధ్యక్షుడు చిన్నగండు భాస్కర్ మాదిగ, రత్నం మాదిగ, జ్యోతి, రఘు, మురళి, సిద్దులు తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట : కార్యదర్శి ప్రసన్నలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న శ్రీను తదితరులు

కేశంపేట : సామాజిక భద్రత పింఛన్లు పెంచి ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు చిర్ర శ్రీను డిమాండ్ చేశారు. ఈమేరకు వేములనర్వ, నిర్దవెల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో పింఛన్లు పెంచుతామని చెప్పి మాట తప్పిందన్నారు. నాయకులు చిన్న మల్లయ్య, రమేష్, యాదయ్య, నవీన్ కుమార్, స్వామి, యాదయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ రవికుమార్

ఆదిభట్ల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆదిభట్ల సీఐ రవికుమార్ అన్నారు. శనివారం క్యాబ్ డ్రైవర్లకు టీసీఎస్‌లో అవగాహన సదస్సు నిర్వహించి, నిబంధనలు పాటించాలని ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్లు మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దన్నారు. మద్యం తాగి డ్రైవ్ చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. నిర్ణీత వేగంతో వాహనం నడుపుతూ.. సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. సమావేశంలో ఎస్సై వెంకటేష్, టీసీఎస్ సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి

మంచాల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని నోముల మాజీ సర్పంచ్ ముత్యమయ్య అన్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు సొంత నిధులతో సమకూర్చిన మైక్‌సెట్‌ను శనివారం బహూకరించాడు. హెచ్ఎం యాదగిరి, కాంప్లెక్స్ హెచ్ఎం.నారాయణరెడ్డి, పల్లాటి జగన్, నవనీత, సునీత, లావణ్య, ప్రభావతి, సరస్వతి, తదితరులున్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



కొందుర్గు : టీచర్ దేవేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు, టీచర్లు



కేశంపేట : సన్మానం పొందిన గురువులు, అంగన్‌వాడీ టీచర్లు

కేశంపేట/కొందుర్గు/చౌదరిగూడ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృతి పవిత్రమైనదని, ఆ వృతిలో ఉన్నందుకు గర్వపడాలని సంగెం హెచ్ఎం చంద్రశేఖర్ అన్నారు. కేశంపేట మండలం సంగెం ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని హెచ్ఎం ఆధ్వర్యంలో శనివారం పాఠశాల ఉపాధ్యాయులను అంగన్‌వాడీ టీచర్లను శాలువాలతో సత్కరించారు. ఉపాధ్యాయులు హెచ్ఎంను సత్కరించారు. అమ్మ అదర్శ పాఠశాల చైర్మన్ అర్చన, కార్యదర్శి సందీప్ తదితరులు పాల్గొన్నారు. కాగా. జిల్లాస్థాయిలో ఉత్తమ అవార్డు అందుకున్న కొందుర్గు మండల పరిధిలోని ముట్పూర్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు దేవేందర్ రెడ్డిని గ్రామస్తులు, తోటి టీచర్లు శనివారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఎంఈవో గాయత్రీదేవి, తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని చింతకుంట తండా గ్రామపంచాయతీ పరిధిలోని గోవులబండ తండాలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న సతీశ్ మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈమేరకు ఎల్‌హెచ్‌పీహెస్ మండలాధ్యక్షుడు రామ్‌చరణ్, గ్రీన్‌చాలెంజ్ కో-ఆర్డినేటర్ వినోద్ నాయక్‌ల ఆధ్వర్యంలో సన్మానించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో సేవలందించిన అంగన్‌వాడీ టీచర్ సోనా, శాంతి బాయి, చిన్ననాయక్, సంజునాయక్, శివరాం, మంగనాయక్, దశరథ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో తండా వాసులు పాల్గొన్నారు.



చౌదరిగూడ : టీచర్ సతీశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

చేవెళ్ల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కృషి కృషిచేస్తున్నానని ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. శనివారం క్యాంప్ కార్యాలయంలో 145మందికి రూ.65.67లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ప్యాక్స్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పెంటయ్యగౌడ్, కృష్ణారెడ్డి, శ్రీకాంత్, ఆగిరెడ్డి, గోపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నరేందర్ గౌడ్, పాండుగౌడ్, రాజశేఖర్, రవీందర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, శంకర్ పాల్గొన్నారు.

అలైన్‌మెంట్ మార్చాల్సిందే..

కడ్తాల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పంట పొలాల మీదుగా నిర్మిస్తున్న 765 హైటెన్షన్ విద్యుత్ టవర్ల నిర్మాణం పనులు నిలిపివేసి అలైన్‌మెంట్‌ను మార్చాలని మండల కేంద్రంలో భూ నిర్వాసితులు చేపట్టిన రిలే నిరహార దీక్షలు శనివారం 13వ రోజుకు చేరాయి. భూనిర్వాసితులు, నాయకులు జంబుల అభిషేక్‌రెడ్డి, పెంటారెడ్డి, జి.రాములు, పర్వత్‌కుమార్ యాదవ్, శ్రీరాములు, వెంకట్రాములు గౌడ్, సత్యనారాయణ, అనిల్‌లు దీక్షలో కూర్చున్నారు.

షాబాద్ ఎంపీవో మృతి

షాబాద్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో షాబాద్ మండల పరిషత్ ఎంపీవో దీపాల శ్రీనివాస్ శనివారం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మృతిచెందాడు. ఈ సందర్భంగా షాబాద్ ఎంపీడీవో అపర్ణ, సూపరింటెండెంట్ శారద, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు శ్రీనివాస్‌రెడ్డి, మల్లేష్, ఏపీవో వీరాసింగ్, కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఉత్సాహంగా 'స్వచ్ఛతా హీ సేవ'

కేశంపేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కేశంపేట మండల పరిధిలోని కొత్తపేటలో శనివారం కార్యదర్శి జంగయ్య ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలిగించారు. ప్లాస్టిక్, చెత్తచెదారం సేకరించారు. మాజీ సర్పంచ్ కమ్మేకార్ నవీన్ కుమార్, నాయకులు కృష్ణ, కల్పన, వెంకటేష్, లక్ష్మయ్య, సంతోష్, కృష్ణయ్య, గెల్వా రెడ్డి, అంజనేయులు, అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

కడ్తాల్ : పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరి చేరవని పంచాయతీ కార్యదర్శి అల్లాజీ అన్నారు. కడ్తాల మండల కేంద్రంలో శనివారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని, రోడ్లపై చెత్త వేయకూడదని తెలిపారు. మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ వార్డు సభ్యుడు కేశని మహేశ్, నాయకులు బ్రహ్మాచారి, సత్యనారాయణ, అంజి, ఆశాలు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



కడ్తాల్ : ర్యాలీలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది

ఘనంగా ప్రభు జన్మదిన వేడుకలు

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నపు ప్రభు ముదిరాజ్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు సీపీఐ నాయకులు, కార్యకర్తలు శంషాబాద్ పట్టణంలో ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆయనకు శాలువాలు కప్పి, కేక్ కట్ చేయించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. మున్ముందు ఇలాంటి వేడుకలు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.యాదగిరి, మండల కార్యదర్శి నర్రా గిరి, జిల్లా సమితి సభ్యులు ఎస్.మల్లేష్, రామావత్ సక్రునాయక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

రాజకీయ లబ్ధికి విపక్షాల కుట్ర



మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బీక్యనాయక్

కడ్తాల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాల్జేసి రాజకీయంగా లబ్ధి పొందేందుకు విపక్షాలు కుట్ర రాజకీయాలు సాగిస్తున్నాయని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్‌లు అన్నారు. ప్రజాపాలనలో ప్రతీ ఒక్కరికి మేలు జరిగి.. పేదలు సంతోషంగా ఉంటే బీఆర్ఎస్, బీజేపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని ఆరోపించారు. మండల కేంద్రంలో శనివారం విలేఖరుల సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బీక్యనాయక్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై విపక్షాలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను, బతుకమ్మ విశిష్టతను కూడా దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న పథకాలు జీర్ణించుకోలేక కొన్ని స్వార్థశక్తులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో కల్వకుర్తినియోజకవర్గం వేగవంతంగా అభివృద్ధి సాధిస్తుంటే కొన్ని స్వార్థశక్తులు అడ్డుకునే యత్నం చేస్తున్నాయని, రీజినల్ రింగ్‌రోడ్డు విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదన్నారు. విపక్షాలు రైతులను తప్పుదోవ పట్టించడం తగదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిలు నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి సల్పుతున్నారన్నారు. నాయకులు శంకర్, జహంగీర్‌అలీ, క్యామ శేఖర్, మంకి శ్రీను, మల్లేశ్‌గౌడ్, రాంచందర్‌నాయక్, తులసీరామ్‌నాయక్, హీరాసింగ్, రవి, జగన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు రిమాండ్

- రూ.18 లక్షలు విలువైన బంగారు, వెండి ఆభరణాలు రికవరీ
- వివరాలు వెల్లడించిన ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను ఆర్జీఐఏ పోలీస్ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం ఏసీపీ కార్యాలయంతో మీడియా సమావేశంలో ఏసీపీ వివరాలు వెల్లడించారు. మున్సిపల్ పరిధిలోని రాళ్లగూడ, రాఘవేంద్రకాలనీలో నివాసం ఉండే నీలం సింగ్, వీరేంద్రప్రతాప్ సింగ్ భార్యాభర్తలు. హైటెక్‌సిటీ హోటల్‌లో పనిచేస్తున్న గుల్ల శివప్రసాద్(21), కూకట్‌పల్లి నెక్సా షోరూంలో పని చేస్తున్న దంగట్ల లోకేష్(19), కూకట్‌పల్లిలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న మందాలి మనోహర్(19)లు కలిసి ఈనెల 9న వీరేంద్రప్రతాప్ సింగ్ ఇంట్లో 17తులాల బంగారు, 50 తులాల వెండి అభరణాలు ఎత్తుకెళ్లారు. అయితే, అదేరోజు నీలం సింగ్, వీరేంద్రప్రతాప్ సింగ్‌లు ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్‌లో కేసు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. ఎట్టకేలకు శివప్రసాద్, లోకేష్, మనోహర్‌లు శనివారం శంషాబాద్ మధురానగర్‌లో పట్టుపడ్డారు. గతంలో వారిపై ఐదు క్రిమినల్ కేసులు నమోదయ్యాయని ఏసీపీ తెలిపారు. వారి నుంచి రూ.18లక్షలు విలువైన బంగారు, వెండి ఆభరణాలు, 3 బైకులు స్వాధీనం చేసుకున్నారు. కాగా, నిందితులు ఆ మూడు బైకులను కూడా చోరీ చేసినట్లు గుర్తించారు. రెండు బైకుల కేసు నమోదు చేయగా మరో బైకు విషయంలో కేసు నమోదు కాలేదు. ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. కేసులో విషయంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీస్ సిబ్బందిని ఏసీపీ అభినందించారు. నిందితులు జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఏసీపీ తెలిపారు. విలేకరుల సమావేశంలో సీఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



రమేశ్ దాస్(ఫైల్)

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన సంఘటన శంషాబాద్ మండలంలో జరిగింది. సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు నరేందర్‌రెడ్డి కథనం మేరకు.. ఒడిషాకు చెందిన రమేశ్‌దాస్ శంషాబాద్ మండలంలోని గండిగూడ గ్రామ శివారులోని ఎంఎస్ గీనిర్ ఆర్చిడ్స్‌కు చెందిన స్థలంలో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తూ అక్కడే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈనెల 14న కొందరు వ్యక్తులు వచ్చి అతడిని అక్కడ నుంచి ఖాళీ చేసి వెళ్లిపొమ్మని చెప్పినట్లు నదమ్ అనంత్‌కుమార్ అనే వ్యక్తికి తెలిపాడు. అప్పటి నుంచి రమేశ్‌దాస్ కనిపించకుండా పోవడంతో పాటు ఫోన్‌లో కూడా స్పందించకపోవడంతో అనంత్‌కుమార్ శనివారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

శంకర్‌పల్లిలో వివాహిత..

శంకర్‌పల్లి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): వివాహిత కనిపించకుండా పోయినట్లు సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శంకర్‌పల్లిలోని రెడ్డి కాలనీలో భార్యాభర్తలైన శివాని(22), నాగేష్‌లు పిల్లలతో కలిసి కొంతకాలంగా నివాసముంటున్నారు. ఈక్రమంలో ఈనెల 18న వారి ఇద్దరు పిల్లలు పాఠశాలకు వెళ్లగా, శివాని అమ్మగారి ఊరైన కొండాకల్‌కు వెళ్తానని భర్త నగేష్‌తో చెప్పి ఉదయం 9 గంటలకు ఇంట్లో నుంచి వెళ్లింది. అయితే, శివాని కొండాకల్‌కు వెళ్లక పోవడం, బంధువుల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో నాగేష్ శనివారం శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.



పోస్టర్ విడుదల చేస్తున్న బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ రామ్‌రెడ్డి

26, 27 తేదీల్లో వాలీబాల్ టోర్నీ

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువతీ యువకులకు ఈ నెల 26, 27వ తేదీల్లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ బూడిద రామ్‌రెడ్డి తెలిపారు. అలాగే పాఠశాల స్థాయి బాలబాలికలకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మంగల్‌పల్లి గేట్ వద్ద నిర్వహించన్ను ఈ టోర్నమెంట్‌కు సంబంధించి ఫౌండేషన్ సభ్యులతో కలిసి ఆయన శనివారం పోస్టర్ విడుదల చేశారు. విజేతలకు నగదు పురస్కారాలతో పాటు షీల్డులు, మెడల్స్ అందజేయనున్నట్లు రామ్‌రెడ్డి తెలిపారు. ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదని, క్రీడాకారులకు భోజన వసతి కల్పిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన వివరించారు.

రక్తదాతలు ప్రాణదాతలు : డీసీపీ



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీసీపీ రాజేశ్

కడ్తాల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయ స్థితిలో ఉన్న తోటి ప్రాణిని కాపాడడంలో రక్తదాతలు ప్రాణదాతలుగా నిలుస్తారని శంషాబాద్ డీసీపీ రాజేశ్ అన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల నిర్వాహణలో యువకులు, స్వచ్ఛంద సంస్థలు ముందుండాలని సూచించారు. కడ్తాల మండలం చరికొండలో శనివారం గ్రామ యువకులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని, గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను అడిషనల్ డీసీపీ పూర్ణచందర్, ఏసీపీ లక్ష్మీనారాయణ లతో కలిసి డీసీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా చరికొండ చరిత్ర పుస్తకాన్ని స్థానిక నాయకులు, యువకులు డీసీపీకి అందజేశారు. రాజేశ్ మాట్లాడుతూ యువత సత్ప్రవర్తనతో ముందుకు సాగి జీవితాన్ని ఉన్నతంగా మలుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ గంగాధర్, ఎస్సైలు వరప్రసాద్, చంద్రశేఖర్, మాజీ జడ్పీటీసీ లక్ష్మమ్మ, మాజీ సర్పంచ్ నర్సింహగౌడ్, మాజీ ఎంపీటీసీ పాలకుర్ల రాములు, గౌని లక్ష్మయ్య, సేవా కార్యక్రమాల నిర్వహణ కమిటీ ఆర్గనైజర్లు మహేందర్, మహేశ్, సాయి, బుచ్చంగౌడ్, నిరంజన్, గణేశ్, రమేశ్, బల్వంత్ రెడ్డి, మహేందర్, బాలకృష్ణ గౌడ్, తిరుపతయ్య, కిరణ్, హరిచంద్ర, భీష్మాచారి, రమేశ్, రామకృష్ణగౌడ్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేయించాలి

శంకర్‌పల్లి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ తప్పక వేయించాలని మున్సిపల్ కమిషనర్ యోగేష్ తెలిపారు. శంకర్‌పల్లి పట్టణంలో శనివారం బ్లూక్రాస్ ఆధ్వర్యంలో మాస్ యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ క్యాంప్ నిర్వహించారు. పట్టణంలోని పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్లు వేసి వీధి కుక్కలను స్టెరిలైజేషన్ కోసం తరలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆనంద్, బ్లూక్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



విజేతలతో బీజేపీ నాయకులు, టీచర్లు

కొత్తూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సేవా పక్వాడ్‌లో భాగంగా మున్సిపాలిటీ అధ్యక్షుడు అమడపురం రణధీర్‌గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక కృష్ణావేణి పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ అంశంపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ కో-కన్వీనర్ అమడపురం నర్సింహగౌడ్, నాయకులు కోస్గి మల్లేష్, ఏనుగు విజయభాస్కర్ రెడ్డి, ప్రభాకర్, శివనాయక్, మైలారం శ్రీశైలం తదితరులున్నారు.